క్లుప్తంగా

భావన ప్రతిభ

ఇల్లెందురూరల్: గ్రీన్‌కార్ప్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోటీలు నిర్వహించారు. భూమి పునరుద్ధరణ అంశంపై పోస్టర్ మేకింగ్ అనే విభాగంలో మండలంలోని సుభాష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి భావన పాల్గొన్నారు. ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ మేరకు భావనను, ఉపాధ్యాయురాలు టి.సువర్ణను బుధవారం పాఠశాలలో ఏర్పాటైన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

బోర్ల డ్రిల్లింగ్ పనులకు శంకుస్థాపన

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో సింగరేణి ద్వారా మంజూరైన మూడు బోర్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల రాము మహేష్, శీలం ఉమ, వల్లాల మంగమ్మ, ఎంపీఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

పాల్వంచరూరల్: విద్యార్థులకు పాఠశాలలో కలుషితం లేని స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి సూచించారు. మండలంలోని మందెరకలపాడు, ఉల్వనూరు, మల్లారం గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలను బుధవారం ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించారు. మందెరకలపాడు పాఠశాలలో రివర్ సాఫ్ట్ ఫిల్టర్ ద్వారా పిల్లలకు అందిస్తున్న తాగునీరు సరఫరా బాగుందని ప్రశంసించారు. ఏపీఎం రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు సతీష్, సురేష్ పాల్గొన్నారు.

ఇల్లెందులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

ఇల్లెందు: ఇల్లెందులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం బుధవారం 3, 9 వార్డులలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు పరిశీలించారు. మాట్లాడుతూ.. స్పెషల్ శానిటేషన్ కార్యక్రమం వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా చేపడుతున్నామని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

టేకులపల్లి: విద్యార్థులు ప్రతీరోజు దినచర్యలో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. సులానగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని బీసీ బాలుర గురుకులం పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ రవీందర్, ఉపాధ్యాయులు చైతన్య, మాధురి, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, స్టాఫ్ నర్స్ రేష్మ పాల్గొన్నారు.

పరిశ్రమలను ప్రోత్సహించండి..

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వం పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం పరిశ్రమలు పెట్టి యువతీ, యువకులను ప్రోత్సహించేందుకు స్థలం కేటాయించడం జరిగిందని ఆ స్థలాన్ని యువతకు అప్పటించి చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహించాలని సామాజిక ఉద్యమకారుడు జలాల్ బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఆదరణకు నోచుకోలేదని, దీంతో ఇల్లెందు ఇప్పటికే శ్మశానంగా మారిపోతోందన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు నూతన పరిశ్రమలు ఏర్పాటు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ట్రైనింగ్ తీసుకున్న యువతకు స్థలాలు కేటాయించాలన్నారు.

దొడ్డి కొమురయ్య వర్ధంతి సభకు తరలిరండి

టేకులపల్లి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమర వీరుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సందర్భంగా ఖమ్మంలో గురువారం జరిగే సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి భూక్యా హర్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండలంలోని బద్దుతండాలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. నైజాం కాలంలో దేశముఖ్, భూస్వాములు, పటేల్, పట్వారీలు, జాగిర్దారుల నిరంకుశత్వ విధానాలను, వెట్టి చాకిరీని వ్యతిరేకిస్తూ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటాన్ని కొనసాగించారని తెలిపారు. అనేకమంది ఈ పోరాటంలో అమరులయ్యారని, దీనిలో తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్య అని పేర్కొన్నారు. విస్నూరు రామచంద్రారెడ్డి తల్లి జానకమ్మ కడవెండి గ్రామంలో పేద ప్రజలతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ, అధిక వడ్డీలను వసూలు చేస్తూ, ప్రజలపై క్రూరంగా వ్యవహరించడాన్ని వ్యతిరేకిస్తూ, ఆ గ్రామ ప్రజలు ఆంధ్ర మహాసభ నాయకత్వంలో పోరాడారని, ఆ పోరాటంలో కామ్రేడ్ దొడ్డి కొమరయ్య ముందు భాగంలో ఉన్నాడని తెలిపారు. భూక్యా నర్సింగ్, కీర్యా, అమర్ సింగ్, జబ్బార్ లాల్, మీట్యా, సురేష్, సీతా, హరిసింగ్, పడిత్యా, బీక్యా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

పట్టించుకోని అధికారులు

జూలూరుపాడు: క్రీడల అభివృద్ధి, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందు ప్రతి గ్రామంలో ఒక గ్రామీణ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన క్రీడా ప్రాంగణాలను వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. క్రీడా ప్రాంగణాలు నిర్మించిన నాటి నుంచి క్రీడాకారులు, యువత, మార్నింగ్ వాకర్స్ గానీ అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నెరవేరకుండా పోయింది. ప్రతీ గ్రామంలో ఒక ఎకరం విస్తీర్ణంలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం(టీజీకేపీ) ఏర్పాటు చేయాలని నిబంధన ఉన్నప్పటికీ ప్రభుత్వ స్థలాల గుర్తింపు సమస్యను సాకుగా చూపుతూ అధికారులు 10 కుంటల నుంచి ఎకరం లోపు విస్తీర్ణంలో అడ్డగోలుగా క్రీడా ప్రాంగాణాలను నిర్మించారు. అదేవిధంగా క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు కేటాయించిన స్థలాలు గ్రామానికి దూరంగా ఉండడం, ప్రభుత్వ స్థలాలు లేకపోవడం, ఆక్రమణలో ఉన్న స్థలాలను కేటాయించడం, అటవీ భూములు, గుట్టలు, రాళ్లు, చెరువులు, ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉందనే ఉద్దేశంతో పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం వల్ల తరగతులు జరిగే సమయంలో బయటి వ్యక్తులు వచ్చి ఆడుతుంటే విద్యార్థుల చదువులు ఎలా సవ్యంగా కొనసాగుతాయని తమ అభిప్రాయాలను ఆ నాడే అధికారులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పారు. క్రీడా ప్రాంగణాల నిర్మాణానికి కేటాయించే స్థలాల గుర్తింపు విషయంలో రెవెన్యూ అధికారులు ఏ అంశాలను పరిగణలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. క్రీడా ప్రాంగణాలను ఉపయోగించకపోవడంతో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగి దీనావస్థలో ఉన్నాయి. క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి తెవాలనే ఆలోచన అధికారులకు లేకపోవడం విచారకరం. జూలూరుపాడు మండలంలో 24 గ్రామ పంచాయతీల పరిధిలో 64 గ్రామాలు ఉండగా 18 గ్రామాల్లో టీజీకేపీల నిర్మించేందుకు అధికారులు స్థలాలు గుర్తించారు. అయితే 14 గ్రామాల్లో టీజీకేపీలు నిర్మాణాలు పూర్తి కాగా, మరో నాలుగు గ్రామాల్లో పనులు నిలిచిపోయాయి. కొమ్ముగూడెం, మాచినేనిపేటతండా, మాచినేనిపేట, భేతాళపాడు, గుండ్లరేవు, సాయిరాంతండా గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతోపాటు అటవీశాఖ అధికారులు అటవీ భూములు ఇచ్చేందుకు నిరాకరించడంతో క్రీడా ప్రాంగణాలు నిర్మించలేదు. అదేవిధంగా దాతలు కూడా స్థలాలు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కొత్తూరు గ్రామంలో క్రీడా ప్రాంగణానికి కేటాయించిన స్థలం ఆక్రమణలో ఉండటంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. సురారం, వినోభానగర్, చింతలతండా గ్రామాల్లో కేటాయించిన భూముల్లో రాళ్లు, రప్పలు అడ్డంకిగా మారడంతో క్రీడా ప్రాంగణాల పనులు చేపట్టకుండా వదిలేశారు. గాంధీనగర్, నల్లబండబోడు, గుండెపుడి, కరివారిగూడెం, గురువాగుతండా ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాల్లో మొక్కుబడిగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 18 గ్రామ పంచాయతీలకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు గానీ, క్రీడా ప్రాంగణాలు అనువుగా లేకపోవడంతో క్రీడాకారులు వినియోగించుకునే అవకాశం లేకుండా పోయింది. ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు ఈవెంట్స్ శిక్షణకు క్రీడా ప్రాంగణాలు అనుకూలంగా లేనికారణంగా జూలూరుపాడు – సాయిరాంతండా గ్రామాల మధ్యగల ఓ రైతు పొలాన్ని పోలీసులు, దాతలు మైదానంగా మార్చడంతో అక్కడకు వెళ్లాల్సి వస్తోంది. అదేవిధంగా మార్నింగ్ వాకర్స్ సైతం అదే మైదానంలో వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు, మార్నింగ్ వాకర్స్ కోరుతున్నారు.



జూలూరుపాడులో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం


అస్తవ్యస్తంగా పడమటనర్సాపురం క్రీడా మైదానం

అందుబాటులోకి తీసుకొస్తాం..



క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. క్రీడా ప్రాంగణాలను పరిశీలించి, నిర్వాహణపై జిల్లా స్పోర్ట్స్ అథారిటీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. నిలిచిపోయిన క్రీడా ప్రాంగణాల పనులు తిరిగి ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– డి కరుణాకర్ రెడ్డి, ఎంపీడీఓ జూలూరుపాడు

సైబర్ నేరాలపై అవగాహన

కొత్తగూడెంరూరల్: సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం నలంద జూనియర్ కళాశాలలో సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ... సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో సైబర్ నేరాలకు కొంతమంది వ్యక్తులు మోసపోయిన విషయం తెలిసిందేనన్నారు. విద్యార్థులు సైబర్‌నేరాలపై అవగహన కలిగి ఉండి, వారి తల్లిదండ్రులకు వివరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ జితేందర్, ఎస్ఐ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఇల్లెందు: మైనార్టీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ సందీప్ బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్ఐ రవికుమార్, ప్రిన్సిపాల్ ముదస్సర్ హుస్సేన్, నజీముద్దీన్ పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

కొత్తగూడెంఅర్బన్: డ్రగ్స్ నిర్మూలనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కొత్తగూడెం త్రీటౌన్ సీఐ శివప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని రైతుబజార్, మానసవికాస్ పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలనకై అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ... డ్రగ్స్ వాడకం వలన యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. అమ్మేవారు, కొనేవారి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నంబర్ ప్లేట్ లేకపోతే చర్యలు

వాహనదారులు నంబరు ప్లేట్లు లేకుండా, అడ్డుగా స్టిక్కర్స్ వేసి వాహనాలు నడిపినా సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. బుధవారం కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ ఎస్సై నరేష్ వారి సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. నంబరు ప్లేట్లు లేని పలు వాహనాలను సీజ్ చేసి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.


మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

రిటైర్‌మెంట్ తర్వాత కూడా పోరాడాలి


సుధీర్‌ను సత్కరిస్తున్న కొత్వాల తదితరులు

పాల్వంచరూరల్: కార్మిక నేతలు ఉద్యోగ విరమణ తరువాత కూడా కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం పనిచేయాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెద్దమ్మగుడి వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత సంగం సుధీర్‌ను కార్మికులు, నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ పాల్గొని మాట్లాడారు. యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, సాదం రామకృష్ణ, మేదరమెట్ల వెంకటేశ్వర్లు, కాల్వ భాస్కరరావు, వై.వెంకటేశ్వర్లు, కాపర్తి వెంకటాచారి, చిరంజీవి, గంధం నర్సింహారావు, భరత్, శ్యామ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ'తో సస్యశ్యామలం చేయండి

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ ద్వారా గోదావరి నది జలాలతో జూలూరుపాడు మండలంలోని వేలాది ఎకరాలను సాగునీటిని అందించి సస్యశ్యామలం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జూలూరుపాడులో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ప్రవహిస్తున్న గోదావరి నదీజలాలతో వేలాది ఎకరాలను సాగులోకి తీసుకరావాలన్నారు. గత ప్రభుత్వాలు అనేక సార్లు డిజైన్ మార్చి చివరికి సీతారామ ప్రాజెక్ట్‌తో నీళ్ల తరలించేందుకు వందలాది కిలోమీటర్ల దూరం కాలువ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఉపయోగపడాల్సిన గోదావరి నీళ్లను దొడ్డిదారిన ఖమ్మం జిల్లాకు తరలించాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఎన్నో ఏళ్లగా జూలూరుపాడు మండల రైతాంగం వర్షాధారిత పంటలు పండిస్తున్నారని, సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ ద్వారా నీళ్ల అందిస్తే రైతుల కలలు నెరవేరుతాయన్నారు. అత్యంత పెద్ద పత్తి మార్కెట్‌గా పేరు గాంచిన జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో యాసా నరేష్, బానోత్ ఇస్రా, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, గార్లపాటి వెంకటి, తాటి పద్మ, సుగుణ పాల్గొన్నారు.

6న చలో హైదరాబాద్


మాట్లాడుతున్న హరిలాల్ నాయక్

టేకులపల్లి: గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని, సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పండిట్, పీఈటీ పోస్టులను అప్ గ్రేడ్ చేయాలని, టీడబ్ల్యూపీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని, జీఓ 317 బాధిత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలలో రెగ్యులర్ పోస్టులు మంజూరు చేయాలని, సూపర్ న్యూమరరీ పోస్టులలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ పోస్టులు మంజూరయ్యే వరకు కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మూడు దశల పోరాట కార్యక్రమాలు నిర్వహించనుందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 6న హైదరాబాద్‌లోని కమిషనర్ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం ఎదుట జరిగే మూడో దశ నిరసన ప్రదర్శన కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాస్, ఈ.ముత్తయ్య, టి.శ్రీనివాసరావు, సీహెచ్ జానకి, వీరన్న, బి.బాలరాజు, బి.వీరయ్య పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం..


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గంలో భూ బాధితులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని టీపీసీసీ సభ్యుడు రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరీ అన్నారు. బుధవారం జిల్లా డీసీసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2012లో బాదావత్ సీతారాములు తప్పుడు కాగితాలు సృష్టించి కొనుగోలుదారులను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. ఇతను 1/70 యాక్ట్ అడ్డు పెట్టుకొని, తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి కోర్టును తప్పుదారి పట్టించి, ఎంతోమంది అమాయకులను బ్లాక్ మెయిల్ చేసి వారి ఆత్మహత్యకు కారకుడు అవుతున్నాడని ఆరోపించారు. రౌడీలను అడ్డుపెటుకొన్ని భూ దందాలకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా చుంచుపల్లి మండలంలోని విద్యానగర్, హౌజింగ్‌బోర్డు కాలనీ, నంద తండా, వెంకటేశ్వర కాలనీలలో రాజకీయనాయకుల అండతో 1/70 యాక్ట్‌లో పట్టాదారులను, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఈ సమావేశంలో గద్దం రాజశేఖర్, దావుద్, మహ్మద్ ఉస్మాన్ అలీ తదితరులు ఉన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

జూలూరుపాడు: గురువారం జరగనున్న దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం జూలూరుపాడులో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ మాట్లాడుతూ.. నీట్ పరీక్షను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను తక్షణమే రద్దు చేసి తిరిగి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు. విద్యాసంస్థల బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాంబు బ్లాస్టింగ్‌పై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

పాల్వంచరూరల్: నిబంధనలకు విరుద్ధంగా తోగ్గూడెంలోని క్వారీలో బాంబ్ బ్లాస్టింగ్ చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని బుధవారం ఆదివాసీ సంఘాల నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నాయకులు మాట్లాడుతూ.. ఏజెన్సీలోని 1/59, 1/70 పెసా చట్టాలు అమలులో ఉన్న ప్రాంతం తోగ్గూడెంలో బినామీ వ్యాపారి అప్పారావు కంకర క్వారీలను లీజుకు తీసుకుని అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. వందమీటర్ల లోతు వరకు బాంబు బ్లాస్టింగ్ చేస్తున్నారని దీంతో వాయికాలుష్యం, గాలి, దుమ్ము లేచి గ్రామంపై ప్రభావం చూపుతోందన్నారు. స్థానికులు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నట్లు చెప్పారు. అధికారులు పట్టించుకోవడం లేదని చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వసభ్య సమావేశం.. మమ


నివేదిక చదువుతున్న సెర్ప్ ఏపీఎం దుర్గారావు

ఇల్లెందురూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన ప్రజాప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశాన్ని మమ.. అనిపించారు. సమస్యలు కళ్లమందే కనిపిస్తున్నా వాటి జోలికి వెళ్లకుండా అధికారులు చదివిన నివేదికలను ఆలకించి చప్పట్లతో సమీక్ష సమావేశాలను ముగించారు. ఒకరిద్దరు ఎంపీటీసీలు తమ గళం వినిపించినా స్పందన లేక వారి ఆవేదన అరణ్య రోదనగా మిగిలిపోయింది. ఇలా ఐదేళ్లు గడిపిన ప్రజాప్రతినిధులు చివరి సమీక్ష సమావేశాన్ని కూడా నామమాత్రపు చర్చలతో కొనసాగించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశంలో ఒక్కో అధికారి వేదిక మీదకు వచ్చి తమ శాఖ నివేదికలను చదివి వెళ్లిపోయారు. ఒకరిద్దరు ఎంపీటీసీలు మాత్రమే అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. కొమరారం గ్రామంలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించకుండా అడ్డుకోవడంపై ఐటీడీఏ ఏఈ సాలార్‌ను ఎంపీటీసీ బిచ్చా నిలదీశారు. దీనిపై ఏఈ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పి జారుకున్నారు. ఇక సెర్ప్ ద్వారా అమలవుతున్న పలు సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అధికారులే లబ్ధిదారులను ఎంపిక చేసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీటీసీ దాస్యం ప్రమోద్ ఆరోపించారు. వేదిక మీదున్న ఎంపీపీ నాగరత్నమ్మ, జెడ్పీటీసీ ఉమాదేవి సైతం ఐదేళ్లుగా సెర్ప్ నుంచి మంజూరైన ఒక్క సంక్షేమ పథకంపై కూడా తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని వాపోయారు. ఇక నుంచి సమాచారం ఇస్తామని సెర్ప్ ఏపీఎం దుర్గారావు బదులిచ్చారు. సమావేశంలో వాంకుడోత్ ఉమాదేవి, వైస్ ఎంపీపీ మండల రాముమహేష్, ఎంపీటీసీలు, ఎంపీడీఓ ధన్‌సింగ్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లెందు: తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టు భర్తీ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ముదస్సర్ హుస్సేన్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. వివరాలకు 9110360408 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

స్టాఫ్ నర్స్, పీఈటీ పోస్టులకు..

పాల్వంచ: పాల్వంచలోని మైనార్టీ గురుకుల బాలికల కళాశాలలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్, పీఈటీ పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షేక్.బీ పాషా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. స్టాఫ్ నర్స్ పోస్టుకు బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం, పీఈటీ పోస్టుకు బీపీఈడీ లేదా ఎంపీఈడీ విద్యార్హత కలిగి ఉండి కనీసం మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. 6వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 8919403948 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉచిత బాక్సింగ్ శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రగతి మైదానంలో నిర్వహించనున్న ఉచిత బాక్సింగ్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోచ్ సత్యబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9299903203 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సింగరేణి మనుగడకు ఉద్యమిద్దాం..


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే కేంద్రంలోని మోదీ సర్కార్ బొగ్గు బ్లాక్‌లను వేలం వేస్తోందని, వీటిని అడ్డుకునేందుకు ఈనెల 5న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, సీపీఎం నాయకులు అన్నవరపు సత్యనారాయణ, గౌని నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో జరిగిన వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రైవేటీకరణను నిలిపివేయాలి..

తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ 4వ తేదీన కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ పిలుపు నిచ్చారు. బుధవారం ఏరియాలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గురువారం జరుపతలపెట్టిన ధర్నాలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం..

తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణను నిలిపివేయాలని టీబీజీకేఎస్, బీఆర్ఎస్‌ల ఆధ్వర్యంలో సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాపు సీతాలక్ష్మి, బదావత్ శాంతి, కొట్టికాపు కృష్ణ పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌ల వేలం రద్దు చేయాలి

బీజేపీ ప్రభుత్వం చేపట్టిన బొగ్గు బ్లాక్‌ల వేలంను రద్దు చేయాలని, బొగ్గు బ్లాక్‌ల వేలానికి నిరసనగా జూలై 5 నుంచి 18 వరకు దశలవారీ ఆందోళనలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగ్ నర్సింహారావు పిలుపునిచ్చారు. శేషగిరిభవన్‌లో బుధవారం జరిగిన ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, గెద్దాడి నగేష్ పాల్గొన్నారు.

ఇల్లెందు: తెలంగాణలో నూతన బొగ్గు గనులు సింగరేణికి దక్కాలంటే కార్మికవర్గమంతా ఉద్యమించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు దాసరి రాజారామ్ పిలుపునిచ్చారు. బుధవారం ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక జేకేఓసీ, జీఎం కార్యాలయంలో ఫిట్ మీటింగ్ నిర్వహించారు. మాట్లాడుతూ.. తెలంగాణలో బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జూలై 5 నుంచి 12 వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. బొగ్గు గనులు సింగరేణికి చెందే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ ఆఫీసుల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. షేక్ ముస్తఫా, సుందర్, సంజీవచారి, లచ్చిరామ్, బందం నాగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యాన...

రాష్ట్రంలో కోల్ బ్లాక్‌ల వేలాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాన్ని ఖండిస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యాన ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ... సింగరేణికి పుట్టినిల్లు ఇల్లెందు అని అటువంటి గొప్ప చరిత్ర కలిగిన ఇల్లెందుకు మాత్రమే కాకుండా సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లోని బొగ్గు గనులను వేలం వేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరికి నిదర్శనం అన్నారు. ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని బెల్ట్ ప్రాంతాలైన 6 జిల్లాలో దశలవారిగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో దిండిగల రాజేందర్, సిలివేరు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వరరావు, అబ్దుల్‌నబీ, గిన్నారపు రాజేష్, సాతల హరికృష్ణ, దేరంగుల పోశం పాల్గొన్నారు.

టేకులపల్లి: బొగ్గు గనుల వేలాన్ని నిలిపి సింగరేణికి అప్పగించాలని బ్రాంచి సెక్రటరీ, సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా నాగేశ్వరరావు, బ్రాంచి సెక్రటరీ అన్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కేటీసీలో జరిగిన పిట్ మీటింగ్‌లో మాట్లాడారు. బొగ్గు గనుల పరిరక్షణ, వేలాన్ని రద్దు చేసి సింగరేణికే కేటాయించాలని కోరుతూ గురువారం ఇల్లెందు జీఎం కార్యాలయం ఎదుట జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.అశోక్, బాసు, రామకృష్ణ, అశోక్, భావ్‌సింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ముట్టడి

బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 5న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కేటీసీలో ఉదయం షిఫ్ట్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా ఈనెల 5 నుండి 12 వరకు దశలవారీగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.